వెల్లివిరిస్తున్న ఆధ్యాత్మికత



జిల్లా కేంద్రంలో 45 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఇటీవలే ఆవిష్కరించారు. వెండి వర్ణంలో హనుమంతుడి రూపం మెరిసిపోతోంది. కాగా, పట్టణ ప్రజల్లో దినదినం ఆధ్యాత్మికత వెల్లివిరిస్తోంది.

8లో▸



పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

పార్టీ పటిష్టతకు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ సూచించారు. ఇచ్చోడలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

9లో▸

గరిష్టం/కనిష్టం
42.0 /30.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

మాజీ స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే రామన్న



మాజీ స్పీకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం బహిరంగ సభలో పాల్గొనేందుకు మంగళవారం మాజీ స్పీకర్ మధుసూదనాచారి జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మధుసూదనాచారిని మర్యాద పూర్వకంగా కలిశారు. తన నివాసానికి ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. పూల మొక్క అందజేశారు. ఎమ్మెల్యే సతీమణి జోగు రమ, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ తదితరులున్నారు. అలాగే అంబేడ్కర్ మనుమడు ప్రకాశ్ అంబేడ్కర్ జిల్లా కేంద్రానికి రాగా, ఎమ్మెల్యే జోగు రామన్న, టీటీడీసీ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట దళిత సంఘాల నాయకులు దుర్గం శేఖర్, సందీప్, ఆనంద్ తదితరులున్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం జిల్లాలోని నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. యువజన సర్వీసుల శాఖ, సెట్విన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్, ఏసీ మెకానిజం అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో కోర్సులో 30 సీట్లు ఉంటాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బయోడేటా ఫాంతో పాటు విద్యార్హత, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను జిల్లా కేంద్రంలోని యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో ఈనెల 25వ తేదీలోగా అందించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9381789457 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


రేపు ఉచితంగా ఆయుర్వేద గుళికల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: మృగశిర కార్తెను పురస్కరించుకుని వైద్య ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఆయుర్వేద గుళికలు పంపిణీ చేయనున్నట్లు ఆయుర్వేద వైద్యుడు యువరాజ్ వైద్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉబ్బసం, ఆయాసం, ఆస్తమాతో బాధపడుతున్న వారిని వ్యాధుల నుంచి విముక్తి చేసేందుకు గుళికలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 20 ఏళ్లుగా గుళికలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సీసీఐ క్రాస్ రోడ్ వద్ద ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు.

పీహెచ్‌సీల పరిధిలో వైద్యశిబిరాలు

నార్నూర్: వానాకాలం ప్రారంభం కానుండడంతో ఏజెన్సీ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, అన్ని పీహెచ్‌సీల పరిధిలోని గిరి పల్లెల్లో వైద్యశిబిరాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి బాలు తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గాదిగూడ మండలంలోని పిప్రి, గోండుగూడ, కొలాంగూడ, అంద్‌గూడ గ్రామాల్లో బుధవారం వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వినియోగించుకోవాలని సూచించారు. సిబ్బంది తులసీదాస్ రాథోడ్ తదితరులున్నారు.

గాలివాన బీభత్సం



పున్నగూడలో నేలకొరిగిన చెట్టు

నార్నూర్: గాదిగూడ మండలం డాబా కే గ్రామపంచాయతీ పరిధి పున్నగూడ గ్రామంలో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. పలువురి ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. దీంతో వర్షపునీరు ఇళ్లలోకి చేరి సామగ్రి తడిసింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచింది. పున్నగూడ గ్రామానికి చెందిన కొట్నాక్ నాగోరావు, ఆత్రం చిత్రు, పెందూర్ కేశవ్‌రావు, జుగ్నాక్ నందుకుమార్, పెందూర్ తులసీరాం, సీడాం బాలాజీ, పెందూర్ చందు, మెస్రం చందు ఇంటి రేకులు నేలకూలాయి. గ్రామంలో సుమారు రూ.2లక్షల నష్టం జరిగినట్లు గ్రామపెద్ద నాగోరావు తెలిపారు.

మన విత్తనం మనకే..!

- తాఖీదు జారీ చేసిన వ్యవసాయశాఖ
- ఇతర రైతులకు అమ్మవద్దని అల్టిమేటం
- కోరిన వెరైటీలనే ఇవ్వాలని ఆదేశం
- లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక
- ఉదయం అలర్ట్.. మధ్యాహ్నం నుంచి మార్కెట్‌లో షరా మామూలే..





వ్యవసాయ శాఖ జారీ చేసిన తాఖీదు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాకు కేటాయించిన మొత్తం పత్తి విత్తనాల ప్యాకెట్లు మన రైతులకే అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య నుంచి తాఖీదు జారీ అయ్యింది. సహాయ సంచాలకులు (ఏడీఏ), మండల వ్యవసాయ

సాక్షి ఎఫెక్ట్

అధికారులు (ఏవో) క్షేత్రస్థాయిలో ఇది అమలయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశాలు వెలుబడ్డాయి. విత్తన డీలర్లు వీటిని అతిక్రమిస్తే విత్తన చట్టం ప్రకారం వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. 'కావాల్సింది.. నో!' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వ్యవసాయశాఖ స్పందించింది. క్షేత్రస్థాయిలో అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

తాఖీదులో ఇలా..

విత్తన చట్టం 1966–పత్తి విత్తనాల ప్యాకెట్ల లభ్యత, జిల్లా రైతులకు అందుబాటులో ఉంచే విషయంలో వ్యవసాయశాఖ తాఖీదు జారీ చేసింది. అందులో ఈ ఏడాది పత్తి విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముందని పేర్కొంది. ఈ నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన విత్తనాల ప్యాకెట్లను జిల్లా రైతులకే అందుబాటులో ఉంచాలని తెలిపింది. ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల రైతులకు అమ్మరాదని పేర్కొంది. ఒకవేళ విత్తన డీలర్లు వీటిని అతిక్రమించి విక్రయించిన పక్షంలో చట్టపరంగా వారి లైసెన్స్‌ను రద్దు చేస్తామని తెలిపింది. అంతేకాకుండా మన రైతు కోరిన విత్తన ప్యాకెట్లను మాత్రమే డీలర్లు ఇవ్వాలని, బలవంతంగా ఇతర రకాల విత్తనాలు అంటగట్టరాదని హెచ్చరించింది.



'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనం

షరా.. మామూలే..

'సాక్షి'లో విత్తన విక్రయాలపై కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఉదయం వ్యవసాయశాఖ సంబంధిత సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారుల ద్వారా డీలర్లకు అల్టిమేటం జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలను ఇతర జిల్లాలు, రాష్ట్రాల రైతులకు అమ్మరాదని చెప్పడంతో ఉదయం నుంచి మార్కెట్‌లో ఈ ప్రభావం కనిపించింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం ఆదేశాల ఎఫెక్ట్ కనిపిస్తుందని మన రైతుల్లో ప్రచారం జరిగింది. అయితే మధ్యాహ్నం వరకు మళ్లీ పరిస్థితి మారిపోయింది. షరా మామూలే.. అన్నట్లు మహారాష్ట్ర రైతులు మార్కెట్‌కు వచ్చారు. డీలర్లు నిబంధనలు అతిక్రమించి వారికి విత్తనాలు విక్రయించారు. ఇదంతా బహిరంగంగా జరిగినా వ్యవసాయశాఖ చోద్యం చూడడం మినహా చేసిందేమీ లేదు. తద్వారా తాఖీదు జారీ చేసేవరకే ఈ అధికారులు పరిమితమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విత్తన డీలర్లు వాటిని పెద్దగా పట్టించుకోలేదన్న ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి. కఠిన చర్యలు తీసుకుంటేనే రాబోయే రోజుల్లో మన రైతులకు పత్తి విత్తనాల కొరత రాదు. లేనిపక్షంలో పత్తి విత్తనాల కోసం రైతులు అగచాట్లు పడే పరిస్థితి ఏర్పడనుంది. ఈ విషయంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్యను ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పథకాలు వినియోగించుకోవాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



ఆదిలాబాద్: ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్: పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భుక్తాపూర్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయం ఐటీ సంస్థ హాల్‌లో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా స్వయం ఉపాధి, పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, జిల్లా ప్రగతి నివేదికను పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ పద్మ భూషణ్‌రాజు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లలో జిల్లా స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగంలో ఎంతో ప్రగతి సాధించిందని తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక విధానం, టీఎస్–ఐపాస్, టీ–ఐడియా, టీ–ప్రైడ్ పథకాల ద్వారా అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన, నిర్దిష్ట సమయంలో పారిశ్రామిక అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో టీఎస్–ఐపాస్ కింద రూ.97.63 కోట్లతో 271 యూనిట్ల స్థాపనకు అనుమతులు మంజూరు ఇవ్వడంతో 1,954 మందికి ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. వివిధ పరిశ్రమల స్థాపనకు టీఎస్–ఐడియా కింద 514 దరఖాస్తులకు రూ.65.85 కోట్ల రాయితీని, టీ–ప్రైడ్ కింద షెడ్యూల్డ్ కులాలు, తెగలు, దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి 460 యూనిట్లకు రూ.30.9 కోట్ల రాయితీని మంజూరు చేసినట్లు తెలిపారు. అంతకుముందు వివిధ పరిశ్రమల ఉత్పత్తుల ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అదనపు కలెక్టర్ ఎస్.నటరాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఎల్డీయం భాస్కర్‌ప్రసాద్, విజయ డెయిరీ డీడీ మధుసూదన్, ఈడీఎం బండి రవి, లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలి

కైలాస్‌నగర్: ఈ నెల 8న ఊరూరా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. చెరువుల పండుగ నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 468 గ్రామపంచాయతీల్లో నిర్వహించనున్న వేడుకలకు ప్రత్యేకాధికారులను నియమించామన్నారు. అన్ని వర్గాల ప్రజలంతా పాల్గొనేలా చూడాలన్నారు. సాయంత్రం 5కు వేడుకలు ప్రారంభించి, రాత్రి 7 గంటలకు ముగిసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్లు శ్రీజ, వికాస్ మహతో, డీఆర్డీవో కిషన్, జెడ్పీ సీఈవో గణపతి, డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

గ్రూప్–1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఈ నెల 11న నిర్వహించనున్న గ్రూప్–1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ నటరాజ్‌తో కలిసి పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సీఎస్, లైజన్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉదయం 10.30కి పరీక్ష ప్రారంభం కానుండగా 10.15 నిమిషాల వరకు అభ్యర్థులను కేంద్రాలకు అనుమతించాలన్నారు. జిల్లాలో 19 కేంద్రాల్లో 6,190 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. కేంద్రంలో నిర్వహించాల్సిన విధుల గురించి వివరించారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్లు శ్రీజ, వికాస్ మోహతో, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే విశ్వకర్మలకు ప్రాతినిధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ఆదిలాబాద్‌రూరల్: చట్ట సభల్లో సభాపతిగా అవకాశం కల్పించి విశ్వకర్మ జాతిని శిఖర స్థాయిలో నిలిపిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని అసెంబ్లీ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి పేర్కొన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని ఓ గార్డెన్స్‌లో నిర్వహించిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల ఆత్మగౌరవ సభకు ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లో కులవృత్తుల వారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందనుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. వడ్రంగి వృత్తిదారులకు కలప విషయంలో అటవీ అధికారుల నుంచి వేధింపులు లేకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సామన్‌పెల్లి నర్సింలు, మీసాల స్వామి, వెవా రాష్ట్ర అధ్యక్షుడు అజయ్, నాయకులు పడకంటి కిష్టయ్య, విఠల్, పడకంటి సూర్యకాంత్, హనుమాండ్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నియామకంలో నిర్లక్ష్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



రిమ్స్ ఆస్పత్రి ఎదుట నినదిస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాల్సిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వైద్యులను నియమించడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌శంకర్ ఆరోపించారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మంగళవారం సందర్శించారు. సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుల నియామకంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఆందోళనలు చేసినా స్థానిక ప్రజాప్రతినిధుల్లో చలనం కనిపించడం లేదని పేర్కొన్నారు. గతేడాది వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హడావుడిగా రిమ్స్ సూపర్ స్పెషాలిటీని ప్రారంభించారని, నేటికీ అత్యవసరమైన వైద్యులను నియమించలేదని తెలిపారు. అత్యాధునిక వసతులు ఉన్నప్పటికీ వైద్యుల కొరతతో సేవలు అందడం లేదని పేర్కొన్నారు. వెంటనే వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆదినాథ్ దినేశ్ మతోలియా, జోగు రవి, ఆకుల ప్రవీణ్, చిలుకూరి జ్యోతిరెడ్డి, మయూర్ చంద్ర, రాజేశ్, రఘుపతి, మహేందర్, నగేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు గాలికొదిలేశారు

- డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్



కాలనీవాసులతో మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆరోపించారు. మంగళవారం ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలో 'ఇంటింటికీ కాంగ్రెస్' కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో కలిసి పర్యటించారు. గడపగడపకూ తిరుగుతూ యువకులు, పెద్దలను కలిశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే పనులను వివరించారు. ఎమ్మెల్యే జోగు రామన్నకు ప్రజలను పాలించే అర్హత లేదని, తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ నగర్ కాలనీలో ఇప్పటివరకు మురికినీటి కాలువలు, సిమెంట్ రోడ్లు, మిషన్ భగీరథ మంచి నీరు ఎక్కడా అందడంలేదు. ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత, ఏఎంసీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



దివ్యాంగులకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కైలాస్‌నగర్: దివ్యాంగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్‌టీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు అందించాలనే డిమాండ్‌తో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు చేస్తున్న ఆందోళన మంగళవారం ఎనిమిదోరోజుకు చేరింది. ఇందులో భాగంగా వైఎస్సార్‌టీపీ నాయకులు ధర్నా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో దివ్యాంగులకు అన్ని విధాలా న్యాయం జరిగిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే దివ్యాంగులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు షేక్ అస్లాం, సర్పంచ్ రాహుల్‌రెడ్డి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్రెండ్లీ పోలీసింగ్'తో నేరాలు తగ్గుముఖం

- కలెక్టర్ రాహుల్‌రాజ్



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారానే నేరాలు తగ్గుముఖం పట్టాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సురక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావు, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీలో వర్టికల్స్, డయల్ 100, బ్లూకోల్ట్స్, పెట్రోకార్, క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్స్, రిసెప్షన్, ఫ్యామిలీ కౌన్సెలింగ్, సీసీటీఎన్ఎస్, సైబర్‌క్రైమ్, కమాండ్ కంట్రోల్ సెంటర్, షీటీమ్, కమ్యూనిటీ పోలీసింగ్, ట్రాఫిక్‌కు సంబంధించిన శకటాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. 270 పోలీస్ బైక్‌లు, బొలెరో వాహనాలు, ఇన్నోవాలతో సురక్ష ర్యాలీ చేపట్టారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ రాథోడ్ జనార్దన్, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ తదితరులున్నారు.

ఆదుకున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది



నగదు, నిత్యావసరాలు ఇస్తున్న సిబ్బంది

బోథ్: ఈ నెల 3వ తేదీన మండలంలోని గుర్రాలతండా గ్రామానికి చెందిన చిన్నారి గంగోత్రి కుటుంబ దీనగాథను 'ఇంటికి పెద్దదిక్కు.. ఆ చిన్నారి' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఆరోగ్యశ్రీ సిబ్బంది స్పందించారు. మంగళవారం సిబ్బంది కుటుంబసభ్యులను కలిశారు. ఆరోగ్యశ్రీ సిబ్బంది తరఫున రూ.15,700 నగదు, నిత్యావసరాలు అందజేశారు. గంగోత్రి తండ్రి మల్హారి సింగ్ ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో గాని నిర్మల్ ఏరియా ఆస్పత్రిలో గాని ఉచితంగా డయాలిసిస్ చేసుకోవచ్చని తెలిపారు. ఉచిత బస్‌పాస్ అందజేస్తామని ఆరోగ్యశ్రీ డీఎం సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ టీం లీడర్ వ్యాస్, కొటిక శ్రీనివాస్, దత్తులు పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు ఆడె గజేందర్ బాధిత కుటుంబ పరిస్థితి తెలుసుకుని నిత్యావసరాలు అందించారు. కొంతమంది యువకులు కుటుంబానికి ఇంటి నిర్మాణం చేపడుతామని పేర్కొనగా.. ఇంటి నిర్మాణానికి తన వంతు సహాయంగా ఆర్థికసహాయం చేస్తానని తెలిపారు. అనిల్, గాజుల పోతన్న, యువకులు ఉన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నియంత్రణ



డ్రైవర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

కైలాస్‌నగర్: అప్రమత్తతతోనే ప్రమాదాల నియంత్రణ సాధ్యమని ట్రెయినీ కలెక్టర్ పీ శ్రీజ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు, కరస్పాండెంట్లు, యాజమాన్యాలకు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు నియమాలు, వాహనాల ఫిట్‌నెస్, స్కూల్ పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నియంత్రణకు పాటించాల్సిన చర్యలు, ప్రమాదాలకు దారి తీసే పరిస్థితులపై అంతకుముందు జిల్లా ఉప రవాణా కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు బస్సు డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. సీపీఆర్ విధానంపై ఏజెన్సీ డిప్యూటీ డీఎంహెచ్‌వో మనోహర్, స్కూల్ బస్సుల్లో తలెత్తే అగ్ని ప్రమాదాల నియంత్రణకు పాటించాల్సిన చర్యలపై అగ్నిమాపక సిబ్బంది ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. డీఈవో ప్రణీత, అగ్నిమాపకశాఖ అధికారి శివాజీ, ఎంవీఐలు శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్, ఏఎంవీఐ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

ఆదిలాబాద్‌టౌన్: వానాకాలం సీజన్ ప్రారంభమైందని రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతామని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇప్పటివరకు 8వేల మెట్రిక్ టన్నుల ఎరువులను అందించినట్లు చెప్పారు. అందుబాటులో ఉన్న 62వేల మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను గోదాముల్లో నిల్వ ఉంచినట్లు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఎమ్మార్పీ ధరకే ఎరువులు, విత్తనాలు విక్రయించేలా చూడాలని సూచించారు. మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నవీనకళ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తండ్రి అంత్యక్రియలు పూర్తిచేసిన కూతురు



తండ్రి అంత్యక్రియల్లో కూతురు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పాత ఉట్నూర్‌కు చెందిన డోలి లక్ష్మిపతి (45) అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. అయితే లక్ష్మిపతికి కుమారులు లేకపోవడంతో కూతురు ఉమామహేశ్వరి అన్నీతానై అంత్యక్రియలు నిర్వహించింది. దీంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఆర్జీయూకేటీకి నిధులు కేటాయించాలని వినతి



మంత్రి హరీశ్‌రావును కలిసిన వీసీ, సిబ్బంది

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీకి మరిన్ని గ్రాంట్లు విడుదల చేయాలని వీసీ వెంకటరమణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి వర్సిటీ పనితీరు, ఇతర విషయాలు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వీసీ తెలిపారు.

బాసర ఆలయ హుండీ లెక్కింపు




లెక్కిస్తున్న సిబ్బంది

భైంసాటౌన్: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీని మంగళవారం లెక్కించినట్లు ఈవో విజయరామారావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో లెక్కించారు. 69 రోజుల ఆదాయం లెక్కించగా రూ.98,19,191 నగదు, 225 గ్రాముల మిశ్రమ బంగారం, 6.920కిలోల మిశ్రమ వెండి, 26 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వైదిక, పరిపాలన సిబ్బంది, ఎస్‌బీ ఐ సిబ్బంది, బాసర పోలీసు సిబ్బంది, వాగ్దేవి సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

కడెం: ఈత సరదా ఓ బాలుడి ప్రాణం తీసింది. కడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని (ఖానాపూర్ మండలం) సింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొండుగూడకు చెందిన కుమురంభీం (12) వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై రాజు వివరాల ప్రకారం.. కొమురంభీం స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు పశువులకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈత కొట్టేందుకు బావిలె దిగారు. భీంకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. కొమురంభీం తల్లిదండ్రులు గతంలో మృతిచెందడంతో తన చెల్లి, అన్న ముగ్గురు బంధువుల ఇంట్లో ఉంటున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత



- పల్లె, పట్టణాల్లో భారీ హనుమంతుడి విగ్రహాలు..
- ఐక్యంగా భక్తిశ్రద్ధలతో పూజలు

ఆదిలాబాద్: శ్రీఆంజనేయ నామ పారాయణం... ధైర్యానికి.. బలపరాక్రమానికి ప్రతీక. జైశ్రీరామ్ అని అనునిత్యం శ్రీరామచంద్రుడి నామ జపం చేసే ఆ హనుమాన్ దేవునిపై భక్తిభావం పొంగిపొర్లుతోంది. దేశంలో వాయుపుత్రుని ఆలయం లేని గ్రామాలు చాలా అరుదు. పల్లెల్లో గుడి చిన్నదైన ఆంజనేయున్ని కొలవడానికి భక్తులు అధిక ప్రాధాన్యతనిస్తారు. భూత, ప్రేత, పిశాచాలను దూరం తరిమి వేయడానికి, ఊరును కాపాడడానికి అంజనీపుత్రుడు అండగా నిలుస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఏ ఊరిలో చూసినా ఆ రామబంటు ఆలయాలు కనువిందు చేస్తాయి. ఈ క్రమంలోనే రోజురోజుకూ ఆంజనేయునిపై భక్తి ఆకాశాన్ని తాకుతుంది. మనసులో కొలువైన అంజనీపుత్రునిపై భక్తి భారీ విగ్రహాల రూపంలో కొలువుదీరుతుంది.

మహాలక్ష్మివాడలో ఇటీవల ప్రతిష్ఠించిన 45 అడుగుల భారీ అంజనేయ స్వామి విగ్రహం

ఉమ్మడి జిల్లాలోనే ఎత్తైన 'సంకట హరణ హనుమాన్'

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 45 అడుగుల భారీ ఆంజనేయ స్వామి విగ్రహం ఆకట్టుకుంటుంది. ఆగస్టు 8 2020 తేదీన ప్రారంభమైన ఈ విగ్రహ నిర్మాణ పనులు మూడు సంవత్సరాల పాటు కొనసాగాయి. స్థానిక కాలనీవాసులు దాతల సహాయంతో రూ.25 లక్షల వ్యయం చేసి ఈ భారీ హనుమంతుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల మే 31 తేదీన ఈ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వెండి వర్ణంలో దగదగా మెరిసిపోతూ దర్శనమిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి ప్రతిమను మహారాష్ట్రలోని హిమాయత్ నగర్ నుంచి వచ్చిన కళాకారులు తీర్చిదిద్దారు. జిల్లాలో భక్తి భావం వెల్లివిరియాలని, ఆధ్యాత్మికతను ప్రజల్లో పెంపొందించాలనే భావనతో ఈ భారీ ప్రతిమను ఏర్పాటు చేయడం జరిగిందని సంకటహరణ హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు వెల్లడిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల భారీ హన్‌మాన్ విగ్రహాల ప్రతిష్ఠాపన సంప్రదాయంగా మారింది. ఇప్పటి వరకు ఆలయాలను నిర్మించి అందులో విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజించే ఆనవాయితీకి విభిన్నంగా ప్రజలు విగ్రహాలను నిర్మిస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా భారీ హన్‌మాన్ విగ్రహాలను గ్రామ ం, పట్టణమనే తేడా లేకుండా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. శ్రీరామ నవమి, హన్‌మాన్ జయంతి సందర్భంగా గ్రామస్తులంతా ఐక్యమత్యంతో హన్‌మాన్ భారీ ప్రతిమల వద్ద వేడుకలను నిర్వహిస్తుండడంతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి జైలు

కడెం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురికి ఖానాపూర్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై కొనన రాజు తెలిపారు. ఇటీవలే డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 27మందిని మంగళవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 23 మందికి రూ.50వేల జరిమానా విధించారు. అలాగే మార్కరి రాకేష్, మేకల శంకర్, కొండరి శంకర్, మంజులరెడ్డిలకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఈ మేరకు వారిని నిర్మల్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలోపడి ఒకరు మృతి



జాడే రమేశ్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన జాడే రమేశ్ (17) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... తాండ్ర గ్రామానికి చెందిన జాటు గాజీరాంకు ఐదుగురు సంతానం. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు జాటు రమేశ్ రోజులాగే సోమవారం మేకలు మేపడానికి వెళ్లి ఎండ వేడికి చెట్టు కింద మేకల మంద పెట్టి కాసేపు సేదా తీరాడు. అనంతరం సమీపంలోని బావి దగ్గరకు నీళ్లు తాగేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయి మృతి చెందాడు. సాయంత్రం మేకలు ఇంటికి వెళ్లినా రమేశ్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలిస్తూ బావి దగ్గరకు వెళ్లగా మృతిచెంది కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దిలీప్ పేర్కొన్నారు.

మానవత్వం చాటిన మంత్రి పీఏ

సాక్షి స్పందన

కడెం: మానవత్వం చాటాడు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పీఏ కృష్ణంరాజు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆపరేషన్‌కు డబ్బులు లేక ఏడాదిగా మంచానికి పరిమితమైన మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేశ్ దీనగాథను 'నా కొడుకును కాపాడండి' అనే శీర్షికన సాక్షి ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన మంత్రి పీఏ కృష్ణంరాజు మంగళవారం కొత్త మద్దిపడగ గ్రామాని వెళ్లి మల్లేశ్‌ను పరామర్శించారు. మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, ఐదు వేల రూపాయలు అందజేశారు. ప్రతి నెలా మందుల ఖర్చు, ఆపరేషన్‌కు సైతం సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పంబాల భీమన్న, భోగ కిషన్, భీమేష్, రాజన్న, బొమ్మెన రాకేష్, కాలేరి దివాకర్, రవి, సచిన్ ఉన్నారు.



మల్లేశ్‌ను పరామర్శిస్తున్న కృష్ణంరాజు

విధి కాటేసింది..

- గుండెపోటుతో యువకుడి మృతి
- తండ్రి చనిపోయిన ఆరునెలలకే కొడుకు
- ఒంటరిగా మిగిలిన తల్లి



వేముల వెంకటేశ్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: కాయకష్టం చేసి కులవృత్తి మేదరి పనిచేసుకుంటూ ఒక్కగానొక్క కొడుకును ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. సంతోషంగా ఉంటున్న ఆ కుటుంబాన్ని విధి వక్రీకరించింది. ఆరు నెలల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా.. సోమవారం రాత్రి కొడుకు గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆ తల్లి గుండెల్ని కదిపివేసింది.. భర్త చనిపోయిన సంఘటన మరువక ముందే, ఒక్కగానొక్క కుమారుడు దూరం కావడంతో ఆ తల్లి బాధ వర్ణనాతీతంగా మారింది. మండల కేంద్రానికి చెందిన వేముల వెంకటేశ్ (30) సోమవారం రాత్రి ఒక్కసారిగా ఆరోగ్యస్థితి విషమించడంతో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఆసుపత్రికి తరలించే క్రమంలో పరిస్థితి విషమించి గుండెపోటుతో మృతి చెందాడు. వెంకటేశ్ పెయింటింగ్ పనులు చేస్తూ తల్లికి ఆసరాగా ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ యువనాయకులు రితేశ్ రాథోడ్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

బాలిక విద్యకు భరోసా



లక్ష్మణచాందలోని కేజీబీవీ విద్యాలయం

- కేజీబీవీల్లో ప్రవేశాలు ప్రారంభం
- జిల్లాలో మొత్తం కేజీబీవీలు 18
- పది ఫలితాల్లో నిర్మల్ కేజీబీవీల్లో 98.99శాతం
- రాష్ట్రంలోనే మొదటి స్థానం కైవసం

జిల్లా సమాచారం...

మొత్తం కేజీబీవీ విద్యాలయాలు	18
మొత్తం కేజీబీవీ కళాశాలలు	10
6వ తరగతిలోని సీట్లు	720
ఇంటర్ ఫస్టియర్‌లోని సీట్లు	800

లక్ష్మణచాంద: చదవాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలు మధ్యలోనే బడి మానేస్తుంటారు. మరి కొందరికి సమీపంలో పాఠశాలలు, కళాశాలలు లేక ఇతర ప్రదేశాలకు బాలికలను పంపేందుకు తల్లిదండ్రులు ససేమిరా అనడంతో మధ్యలోనే బడి మానేస్తున్నారు. అటువంటి బాలికలను అక్కున చేర్చుకుని పేద, మధ్య తరగతికి చెందిన బాలికలకు భరోసానిస్తూ కార్పొరేట్ హంగులతో కూడిన వసతితో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి జిల్లాలోని కేజీబీవీ బాలికల విద్యాలయాలు.

ప్రవేశాలు ప్రారంభం...

2023- 24 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలోని కేజీబీవీలలో ఆరవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 18 కేజీబీవీ బాలికల విద్యాలయాలు ఉండగా ఇందులో 6వ తరగతిలో 720 సీట్ల కోసం, 10 కేజీబీవీ బాలికల కళాశాలలు ఉండగా ఇంటర్ మొదటి సంవత్సరంలో 800 సీట్ల కోసం ప్రవేశాలు మే 25 నుంచే మొదలయ్యాయి.

ఇంటర్‌లో గ్రూపులు....

జిల్లాలోని 10 కేజీబీవీ కళాశాలలో పలు రకాల గ్రూపులు బాలికలకు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా ఎంపీసీ, బైపీసీ గ్రూపులు లక్ష్మణచాంద, దిలావార్‌పూర్, జామ్, నర్సాపూర్, భైంసా, దస్తురాబాద్ కేజీబీవీల్లో అందుబాటులో ఉన్నాయి. అలాగే సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులు మామడ, కడెం, నిర్మల్‌రూరల్ కేజీబీవీలలో ఉన్నాయి.

ఆంగ్ల మాధ్యమంలో....

జిల్లాలోని కేజీబీవీలలో 6-10 తరగతుల్లో జామ్, లోకేశ్వరం, దిలావార్‌పూర్ ఆంగ్లమాధ్యమం సౌకర్యం ఉంది. ఇంటర్‌లో ఆంగ్ల మాధ్యమంలో చేరాలనే వారికి పెంబి, నర్సాపూర్(జీ), సోన్, నిర్మల్ రూరల్, దస్తురాబాద్ కేజీబీవీలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరే వారికి అందుబాటులో ఉందని సెక్టోరియల్ అధికారి శ్రీదేవి తెలిపారు.

సకల సౌకర్యాలు....

జిల్లాలోని కేజీబీవీ విద్యాలయాల్లో అన్ని రకాల సదుపాయాలు సమకూర్చారు. ఇందులో విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానం, ల్యాబ్ సౌకర్యం, ఇంటిని మైమరిపించే మూడు పూటల నాణ్యమైన పోషకల భోజనం, అంకితభావం, నిరంతరం విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసే ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యాబోధన స్టడీ అవర్ నిర్వహణ ఉంటుంది.

అత్యుత్తమ ఫలితాలు....

జిల్లాలోని కేజీబీవీలు అటు పాఠశాలతో పాటు ఇటు కళాశాలలు కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. రాష్ట్రంలోని 33 జిల్లాలో 10వ తరగతి ఫలితాల్లో నిర్మల్ కేజీబీవీలు 98.99 శాతం పాస్‌తో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచాయి. జిల్లాలోని 18 కేజీబీవీలలో 98.99 శాతం, ఇందులో 14 కేజీబీవీలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో ఆరుగురు బాలికలు 10 జీపీఏ సాధించారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో 92 శాతం, రెండో సంవత్సరంలో 93 శాతం సాధించాయి.

బోధన బాగుంది..



కేజీబీవీలలో అంకిత భా వం పనిచేసే ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నారు. నిత్యం ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్టడీ అవర్ నిర్వహణ ఉంటుంది. ఇంటర్ ఎంపీసీ విభాగంలో 935 మార్కులు సాధించాను.

– స్నేహ, ఇంటర్ విద్యార్థిని, లక్ష్మణచాంద, కేజీబీవీ

10 జీపీఏ సాధించాను



కేజీబీవీలలో అంకిత భావం గల ఉపాధ్యాయులు ఉత్తమ విద్యను బోధిస్తున్నారు. దీంతో ఇటీవల ప్రకటించిన 10 ఫలితాలలో 10 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచాను.

– హంసిని, పెంబి కేజీబీవీ

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో 18 కేజీబీవీ బాలికల విద్యాలయాలు, 10 కేజీబీవీ బాలికల కళాశాలలు ఉన్నాయి. ప్రస్తుతం 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశాలు తీసుకుంటున్నాం. విద్యతో పాటు, బాలికలను పలు రకాల వృత్తి నైపుణ్యాల కోర్సులు, యోగా, కరాటే నేర్పుతున్నాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీదేవి, సెక్టోరియల్ అధికారి

కూలీల కొరత.. రైతులకు భారం



ధాన్యం బస్తాలు కుడుతున్న రైతు

కుంటాల: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కుంటాలలో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కూలీలు లేక కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోవడంతో రైతులు రోజుల తరబడి పంట నిరీక్షించాల్సి వస్తోంది. ధాన్యం తూకం వేసేందుకు సరిపడా కూలీలు లేక రైతులే తూకం వేసుకోవాల్సిన పరిస్థితి. దీనికి తోడు తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు కూడా లేకపోవడం రైతులకు శాపంగా మారింది. రైతులే ధాన్యాన్ని తూకం వేసి బస్తాలను కుట్టేసి ట్రాక్టర్లలో మిల్లులకు తరలిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఆర్థికభారం పడుతోందని దిగులు చెందుతున్నారు. రైతులే తూకం వేసి మిల్లులకు తరలించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి కూలీల కొరత తీర్చి తగినన్నీ లారీలను సమకూర్చాలని రైతులు వేడుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్నోవేషన్‌కు దిలావర్‌పూర్ విద్యార్థులు



ఎం.హారిక



హరిచందన

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ విద్యార్థినిలు తమదైన శైలిలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే 2022–23 స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ పోటీలకు నిర్మల్ జిల్లా నుంచి ఒక ఆలోచన విధానంతో దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇందులో ఎం.హారిక, హరిచందన, సాయిపూజ, మనూషలు ఉన్నారు. వారు రూపొందించిన నూతన ఆలోచన విధానమైన ఎక్స్‌పీరియడ్ మెడిసిన్ ఇండిగేటర్ విశ్లేషనతో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి రవీందర్, సైన్స్ అధికారి వినోద్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో మొత్తం 70 ఆలోచనలు ఎంపికవగా అందులో నిర్మల్ జిల్లా నుంచి మొదటి స్థానంలో దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థినిలు ఉండడం గర్వకారణంగా ఉందని ఎస్‌వో అపర్ణ, జెండర్ కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. వీరు ఈ నెల 20 నుంచి 22వరకు రాష్ట్ర స్థాయిలో జరిగే ఇన్నోవేషన్ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌వో తెలిపారు.

'గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



మాట్లాడుతున్న ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గిరిజన గురుకుల జూనియర్ కళాశాల (పివిటిజి) బాలురు, బాలికల ప్రవేశం కోసం మంగళవారం ఉట్నూర్‌లోని స్థానిక కేబీ కాంప్లెక్స్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి కొలాం, తోటి, మన్నె తెగలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. హయాత్‌నగర్ బాలికల కాలేజీలో బైపీసీ 28, ఎంపీసీ 01, సీఈసీ ఐగురు ప్రవేశం పొందారు. బాలుర కళాశాలకు బైపీసీ 11, ఎంపీసీ 20, సీఈసీ 9 మంది ప్రవేశాలు పొందారు. ఈ కార్యక్రమానికి ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి వి.గంగాధర్ అధ్యక్షత వహించగా బాలుర కళాశాల, హయాత్‌నగర్‌లోని ప్రిన్సిపాల్ యాదగిరి, వైస్ ప్రిన్సిపాల్ కేశవులు, బాలికల కళాశాల హయాత్‌నగర్ సిబ్బంది కుమార స్వామి, మల్లేశ్, మహేశ్, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ సుమలత పాల్గొన్నారు.